
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల
జిల్లా వార్తలు
గురువారం 19 డిసెంబరు 2024





వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ముఖ్యమంత్రి

## కర్నూలులో వైఎస్ జగన్

### వివాహ వేడుకకు హాజరు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కర్నూలుకు వచ్చారు. నగర శివారులోని జీఆర్సీ ఫంక్షన్ హాల్‌లో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి కుమార్తె డాక్టర్ కె.చతుర, డాక్టర్ కె.నిఖిల్ వివాహానికి జగన్ హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్ కర్నూలు ఎస్‌ఏపీ క్యాంపు మైదానంలో దిగారు. అక్కడ కర్నూలు, పాణ్యం జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి వివాహానికి హాజరైన జగన్ వధూవరులను ఆశీర్వదించి వెళ్లారు. జగన్ వెంట జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆలూరు, మంత్రాలయం ఎమ్మెల్యేలు బుసినే విరూపాక్షి, వై.బాలనాగిరెడ్డి, సీనియర్ నాయకులు హఫీజ్‌ఖాన్, కంగాటి శ్రీదేవి, బుట్టా రేణుక, కాట సాని రామిరెడ్డి, గంగుల నాని, శిల్పా చక్రపాణిరెడ్డి, రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సుధీర్ తదితరులు ఉన్నారు.

# నిలిచిన నాపరాయి




నిలిచిపోయిన నాపరాయి ట్రాక్టర్లు

- 250 నుండి 50కి పడిపోయిన రవాణా వాహనాల సంఖ్య
- బుధవారం చెక్‌పోస్టు దాటింది 60 మాత్రమే..
- రాయల్టీకి అదనంగా కన్సిడరేషన్ ఫీజు చెల్లించలేకే ఈ దుస్థితి
- సమస్య పరిష్కరించకుంటే రోడ్డున పడనున్న కార్మికులు



ఖాళీగా కూర్చున్న రాయల్టీ చెక్‌పోస్టు సిబ్బంది

కొలిమిగుండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాపరాయి రవాణా నిలిచి పోయింది. నాపరాయి రవాణా చేసే ట్రాక్టర్లు, లారీలు బుధవారం పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. కొలిమిగుండ్ల, అవుకు మండలాల నుండి తాడిపత్రి, అనంతపురం, కర్ణాటక ప్రాంతాలకు ప్రతి రోజూ నాపరాయి రవాణా అవుతుంది. ప్రతి రోజూ సరాసరి 250 నుంచి 300 వాహనాల్లో నాపరాళ్లు జిల్లా సరిహద్దు ప్రాంతంలోని చెక్‌పోస్టును దాటి ఇతర ప్రాంతాలకు వెళుతుంటాయి. అయితే బుధవారం చెక్‌పోస్టును దాటిన వాహనాల సంఖ్య 60కి లోపే ఉండడం గమనార్హం. ఒక్కసారిగా నాపరాయి రవాణా నిలిచి పోవడంతో ఇటు గనుల యజమానులతో పాటు, గనుల్లో పనిచేసే కార్మికులు, డ్రైవర్లు ఉపాధి కోల్పోయి పరిస్థితి ఏర్పడింది. రాయల్టీ మొత్తానికి సమానంగా కన్సిడరేషన్ ఫీజు చెల్లించాలని ఆన్‌లైన్‌లో మైనింగ్ శాఖ నిబంధనలు విధించడంతో గనుల యజమానులు రాయల్టీ బిల్లులను తీసుకోవడానికి భయపడిపోతున్నారు. దీంతో నాపరాళ్ల రవాణా ఆగిపోయింది. ఐదు టన్నుల ట్రాక్టరుకు ప్రస్తుతం రాయల్టీ మొత్తం డీఎంఎఫ్ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) మినహాయిస్తే రూ.422 చెల్లిస్తున్నారు. దీనికి వంద శాతం అదనంగా కన్సిడరేషన్ ఫీజు చెల్లించాలని రెండు రోజులుగా కొత్త నిబంధన ఆన్‌లైన్‌లో చూపుతుండడంతో గనుల యజమానులు ఆందోళన చెందుతూ నాపరాయి రవాణాను నిలిపి వేస్తున్నారు. వాస్తవానికి కన్సిడరేషన్ ఫీజు వసూలుకు సంబంధించిన నిర్ణయం గత ప్రభుత్వమే తీసుకున్నా, ప్రస్తుతం వసూలు చేయాలని మైనింగ్ శాఖ భావించడంతో సమస్య తీవ్రంగా మారింది. అసలే నష్టాల్లో ఉన్న నాపరాళ్ల పరిశ్రమ వర్గాలు ఒక్కసారిగా రెండింతల (సుమారు రూ.844) మొత్తాన్ని చెల్లించలేక ఆందోళన చెందుతున్నారు. దీంతో నాపరాతి గనుల నిర్వహణ ఆపివేయాలని నిర్ణయం తీసుకుంటున్నారు. ఇదే జరిగితే నాపరా తి గనులు, పాలిషింగ్ యూనిట్లలో పని చేసే వేలాది మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.



మూతబడిన నాపరాళ్ల పాలిషింగ్ యూనిట్

## నంద్యాలను నందనవనంగా తీర్చిదిద్దుతా

### న్యాయ శాఖ మంత్రి ఫరూక్



నూతన రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని ఇండోర్ స్టేడియం సర్కిల్ నుంచి పద్మావతినగర్ ఆర్చ్ వరకు ఇరువైపులా సీసీరోడ్డు నిర్మాణానికి మంత్రి ఫరూక్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ సాధారణ నిధుల నుంచి రోడ్డు వేస్తున్నామని అన్నారు. గుంతలు లేని రోడ్లను నిర్మించడమే ధ్యేయమన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో నంద్యాల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు. అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర యువనాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

### మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్ శ్రీకారం చుట్టారని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని తెలుగుపేటలో రూ.65 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. మంత్రికి మండల విద్యాధికారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యాబోధన అందించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. నారాలోకేశ్ విద్యారంగలో మార్పులు తేవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలమేరకు మెరుగైన మౌళిక వసతులు, పెండింగ్‌లో ఉన్న పనులు సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే గురువులన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి చదువుతో పాటు ఆటలు పాటవి వంటివి కూడా ముఖ్యమన్నారు. రోజుకు ఒక గంట సేపు విద్యార్థులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాలలకు సంబంధించి పెండింగ్ పనులు , సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో కిచెన్ రూమ్, డైనింగ్ హాల్‌తో పాటు త్రాగునీటి సమస్య గురించి, అదనంగా రెండు తరగతి గదులు కావాలని హెచ్ఎం ప్రతాప్‌తోపాటు ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా ఆయాసమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్ టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, ఎంపీటీసీ జక్కుకిట్టయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశీంబాబు, అన్సా, పాఠశాల హెచ్ఎం ప్రతాప్, టీచర్లు నాగరాజు, కృష్ణయ్య, షరీప్, అబ్దుల్లా, సత్యనారాయణరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో తెలుగుపేట వాసులు, పంచాయితీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు పాల్గొన్నారు.

## వెంటాడుతున్న ముసురు



చాగలమర్రి మండలం శెట్టివీడు రహదారిపై ఆరబెట్టిన వరి ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారడం.. తుఫాన్‌గా మార్పు చెందే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా రెండు రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉంటుందని, రాయలసీమలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలోని రైతన్నలు మళ్లీ పంట ఉత్పత్తులు కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బంగాళాఖాతంలో తుఫాన్లు, అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలతో గత నెల 17 నుంచి అన్నదాతలు పైర్ల కోతలు కోయాలన్నా నూర్పిడి చేయాలన్నా భయపడాల్సిన పరిస్థితి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఆత్మకూరు, కర్నూలు తదితర కేసీ కెనాల్ పరిధిలోని ఆయకట్టు రైతులు ఎక్కువగా వరి పంటను సాగు చేశారు. ముసురు వానలు కురిసే అవకాశం ఉండటం వల్ల రైతులు వరికోతలు మొదలు పెట్టవద్దని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

## ఆలయ సిబ్బందికి డ్రస్ కోడ్

మహానంది, డిసెంబరు 18((ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో విధులు నిర్వహించే మతపరమైన సిబ్బందితో పాటు అర్చకులు తప్పనిసరిగా డ్రస్‌కోడ్ పాటించాలని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధ వారం తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం సిబ్బంది అందరు నుదుట తిలక ధారణతో విధులకు హాజరుకావలన్నారు. అలాగే ఆలయంలో విధులు నిర్వర్తించే రెగ్యులర్, ఏజన్సీ సిబ్బంది తెల్లచొక్కా, పంచా ధరించా లన్నారు. కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది తెల్లచొక్కా, తెల్లపంచ లేదా ప్యాంట్‌ను ధరించాలన్నారు. మహిళా సిబ్బంది దేవస్థానం సూచించిన ఏకరూప దుస్తులు ధరించాలని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు తప్పనిసరిగా గుర్తింపుకార్డు ధరించాలన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనా నికి వచ్చే భక్తులకు ఓర్పుతో దర్శన భాగ్యం కల్పించి మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు.

## ఏబీసీడీ.. కర్నూలుకు మూడో స్థానం

- క్లూ లేని కేసుల్లో మెరుగైన పురోగతి
- జిల్లా పోలీసులను అభినందించిన డీజీపీ

కర్నూలు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో ఏబీసీడీ అవార్డుల పరంపర మరోసారి మొదలైంది. గత ప్రభుత్వం ఈ అవార్డుల ప్రదానంలో నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ఏబీసీడీ అవార్డుల ప్రధానం చేపట్టింది. ఈ ఏబీసీడీ అవార్డులో కర్నూలు జిల్లాకు మూడో స్థానం దక్కడం విశేషం. ఈ మేరకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు కేసు చేధించిన పలువురు పోలీసులను రాష్ట్ర డీజీపీ తిరుమల్‌రావు విజయవాడలో ప్రత్యేకంగా అభినందించి ఏబీసీడీ అవార్డులు అందజేశారు. ఈ ఏడాది జూలై 28న పేటయ్య అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఓ డ్రమ్ములో సీల్ వేసి ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామ పరిసరాల్లో పడేసి వెళ్లిపోయారు. మొదట్లో గుర్తు తెలియని మృత దేహంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి కేసును చేధించారు. అప్పట్లో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆస్పరి సీఐగా ఉన్న హనుమంతప్ప ప్రస్తుతం ఆస్పరి సీఐగా ఉన్న మస్తాన్‌వలి, హాలహర్వి ఎస్ఐ నరేంద్ర, ఆలూరు ఎస్ఐ ఓబులేసు హెడ్ కానిస్టేబుళ్ల్ లక్ష్మన్న, కానిస్టేబుళ్లు మల్లికార్జున, ఆంజనేయులు, రాము, ఆగస్టీన్, హోంగార్డు గోవర్ధన్‌సింగ్‌లు ఈ కేసును చేధించడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఎలాంటి క్లూ లేకుండా ఉన్న కేసుల్లో రెండే రోజుల్లో కేసును చేధించి నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.7 లక్షల నగదును సీజ్ చేశారు. ఎలాంటి క్లూ లేకున్న ఈ కేసులో సీసీ కెమెరాలు, సెల్‌టవర్స్ డంప్, డ్రమ్ము మీద ఉన్న అక్షరాల ఆధారంగా కేసులో కీలక విషయాలను రాబట్టి నిందితులను అరెస్టు చేశారు. త్వరిగతిన కేసు చేధించినందుకు గానూ ఈ కేసు ఏబీసీడీ అవార్డుకు ఎంపికై తృతీయ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో సీఐడీ అడిషినల్ డీజీ రవిశంకర్ అయ్య న్నార్, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ఉన్నారు.




డీజీపీ నుంచి ఏబీసీడీ అవార్డు అందుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్, జిల్లా పోలీసులు

## ఎల్పీఎం.. ఏం చేయలేం..!



- జాయింట్ ఎల్పీఎం నెంబర్‌తో అనేక కష్టాలు
- భూములు కొనలేని అమ్మలేని పరిస్థితి
- అడ్డగోలుగా జగనన్న భూ సర్వే
- రెవెన్యూ సదస్సుల్లోనూ స్పష్టత కరువు
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు



కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్వే నెంబర్ల స్థానంలో గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఎల్పీఎం భూ సమస్యలను తెచ్చి పెట్టింది. రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో భూ సర్వే తప్పులతడకగా నిర్వహించారు. అలాగే గ్రామ స్థాయి నుంచి కార్పొరేషన్ వరకు భూములు భూకబ్జాలకు గురయ్యాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం భూ సమస్యలపై గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. భూకబ్జాలు, దోపిడీ, భూ సర్వేలపై గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులలో అర్జీదారులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో రీసర్వే సమస్యలపై 18,600 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో పది వేలకుపైన భూ సమస్యలు, ఎనిమిది వేలు ఇతర సమస్యలు ఉన్నాయి. వీటిలో మూడు వేల దరఖాస్తులను అధికారులు పరిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన జగనన్న భూసర్వేలో అత్యధిక శాతం రైతుల భూములకు జాయింట్ ఎల్పీఎం కేటాయించారు. జాయింట్ ఎల్పీఎంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. భవిష్యత్తులో రైతులు తమ పొలాలను జాయింట్ ఎల్పీఎంతో అమ్మలేని కొనలేని పరిస్థితి ఏర్పడింది. జాయింట్ ఎల్పీఎం తొలగించి సింగిల్ ఎల్పీఎం ఇవ్వాలన్నా కచ్చితంగా ఆన్‌లైన్ సబ్ డివిజన్ చేయాలి. సబ్ డివిజన్ చేసేందుకు కచ్చితంగా రూ.550 చలానా కట్టాలి. సబ్ డివిజన్ చేసిన అనంతరం మరలా రూ.150తో మ్యుటేషన్ కట్టాలి. మ్యుటేషన్ అనంతరం జాయింట్ ఎల్పీఎంతో ఉన్న మిగతా రైతులు కచ్చితంగా లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలి. అంతేగాకుండా మ్యుటేషన్ కట్టేటప్పుడు పొలానికి సంబంధించి డాక్యుమెంట్లు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు పొందుపరచాలి. డాక్యుమెంట్లు లేకపోతే మ్యుటేషన్ కట్టలేని పరిస్థితి నెలకొంది. కొంత మంది రైతులకు ప్రభుత్వ భూమికి చెందిన ఎల్పీ నెంబర్లు ఇచ్చారు.



మిగతా 6 లో...



# పొద్దు పొద్దునే బతుకు పోరు






చలి తీవ్రత పెరిగినా బతుకు బండి ముందుకు సాగాల్సిందే. మంచు విపరీతంగా కురుస్తున్నా ఆహార అన్వేషణ కొనసాగాల్సిందే. కొందరు తుంగభద్ర నది నుంచి ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను తరలించి పొట్టపోసుకుంటుంటే.. మరికొందరు చేపల వేట ద్వారా.. ఇంకొందరు బట్టలు ఉతకడం ద్వారా జీవనం గడుపుతున్నారు. మనుషుల బతుకు పోరు ఇలా ఉంటే పక్షులు సైతం ఆహారం కోసం వేట సాగిస్తున్నాయి. తుంగభద్ర నది ఒడ్డుకు చేరుకొని చేపలు పట్టడానికి మాటు వేశాయి. ఇలా ఎవరి జీవన యానం వారిదే అన్నట్టుగా ఉన్న ఈ దృశ్యాలు తుంగభద్ర నది ఒడ్డున ఆవిష్కృతమయ్యాయి. ఆంధ్రజ్యోతి తన కెమెరాలో క్లిక్‌మనిపించింది.



- కర్నూలు రూరల్, ఆంధ్రజ్యోతి



## ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి

- ఉపాధి హామీ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- రోడ్లు సంక్రాంతిలోపు పూర్తి కావాలి
- ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం కావాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):** గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల్లోని ఆస్తుల పరిరక్షణ, జిల్లా స్థాయి సమావేశం, ఉపాధి హామీ పథకం అమలు, పల్లె పండుగ- రోడ్ల నిర్మాణం, ఎంఎస్ఎంఈ సర్వే పురోగతిపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలలో ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములు, గ్రామాల్లో శ్మశాన భూములు, ఇరిగేషన్ కెనాల్స్ ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోని, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, ఆలూరు, కృష్ణగిరి, దేవనకొండ, తుగ్గలి మండలాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను వారంలోగా భర్తీ చేయకపోతే ఎంపీడీవోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 48 సచివాలయాల్లో ఎంఎస్ఎంఈ సర్వే ఫిబ్రవరి 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్పీ (అడ్మిన్) జి. హుశేన్‌పీరా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు ప్రశంసాప్రతాలు సమర్పిస్తున్న అధికారులు

**ఓర్వకల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని ఏపీఆర్ గురుకుల పాఠశాలలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన ఆహార పదార్థాలను వాడుకుని సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన పంటలు, అధిక దిగుబడులతో పాటు లాభాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎంపీ లక్ష్మయ్య, ఎంఎంటీఎల్ వంశీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఉపాధ్యాయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్పీఎం.. ఏం చేయలేం..!

- జాయింట్ నెంబర్‌తో అనేక కష్టాలు
- భూములు కొనలేని అమ్మలేని పరిస్థితి
- అడ్డగోలుగా జగనన్న భూ సర్వే
- రెవెన్యూ సదస్సుల్లోనూ స్పష్టత కరువు
- సబ్ డివిజన్, మ్యుటేషన్‌ల పేర్లతో వేధింపులు
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు

(ఐదో పేజీ తరువాయి)

ఆన్‌లైన్ సబ్ డివిజన్, మ్యుటేషన్ తదితర లాంటి సమస్యలతో అనేక మంది రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధానంగా అనేక గ్రామాల్లో ఒక రైతుకు కేటాయించిన ఎల్పీఎం బదులు మరో రైతుకు చెందిన ఎల్పీఎంను రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఆ ఎల్పీఎం తొలగించాలన్నా సంబంధిత రైతు లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలి. దీంతో రైతుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అనే చందంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో భూసర్వే చేసేటప్పుడు ఎకరాకు 10 వేల నుంచి 30 వేలకు మండల, గ్రామ సర్వేయర్‌లు రైతుల దగ్గర నుంచి వసూలు చేశారు. ఇప్పటికీ రైతులకు మండల గ్రామ సర్వేయర్లు కాసులు ఇస్తే గానీ భూములను సర్వే చేయబోమని చెబుతున్నారు.

**● సర్వేయర్, వీఆర్వోల మధ్య కోల్డ్ వార్:**

జిల్లాలో 672 గ్రామ వార్డు సచివాలయాలు ఉన్నాయి. 5320 మంది సిబ్బంది పని చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఉదయం 11 గంటల వరకు కూడా హాజరు కావడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. అంతేగాకుండా అనేక గ్రామాల్లో గ్రామ సచివాలయం సర్వేయర్, వీఆర్వోల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. సమస్య పరిష్కారానికి వచ్చిన రైతులకు ఒకరు ఆన్‌లైన్ సబ్ డివిజన్ సమస్యని, మరొకరు మ్యుటేషన్ కట్టమని చెబుతున్నారు.

**● ప్రచారం చేయని రెవెన్యూ అధికారులు :**

జిల్లాలో 472 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 250 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రీసర్వే జరగని గ్రామాల్లో కూడా ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ప్రచారం చేయక పోవడంతో రైతులకు, రెవెన్యూ సదస్సులు తెలియని పరిస్థితి నెలకొంది. మరి కొన్ని గ్రామాల్లో ఒక రోజు ముందు మాత్రమే మండల రెవెన్యూ సిబ్బంది షెడ్యూల్‌ను తెలియజేస్తున్నారు.

**● సెలవుల్లో సచివాలయ అధికారులు:**

గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు జరుగుతున్నా జిల్లాలోని చాలా గ్రామ సచివాలయాల్లో అధికారులు సెలవుల్లో వెళ్తున్నారు. గ్రామాల్లో చేసిన భూసర్వే తప్పులు ఎక్కడ బయట పడతాయోనని ముందస్తు జాగ్రత్తగా రెవెన్యూ అధికారులు సెలవుల్లో వెళ్తున్నారు. పని ఒత్తిడి భారం ఎక్కువ ఉంటుందనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ సిబ్బంది సెలవులో వెళ్తున్నారు. ఈ మేరకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు అత్యధికంగా సెలవులు పెడుతున్నారు. ప్రభుత్వం గ్రామ సభలు రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహిస్తున్నా కింది స్థాయిలో మాత్రం కొందరు రెవెన్యూ అధికారులు అనేక రకాలుగా నీరుగార్చే ప్రయత్నిస్తుండటం కొసమెరుపు. జిల్లాలోని కొందరు తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ సదస్సులపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రెవెన్యూ సదస్సులపై రెవెన్యూ అధికారులు గానీ, ఉన్నతాధికారులు గానీ తనిఖీలు పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**● రైతులను ఇబ్బంది పెట్టొద్దు - వెంకటనారాయణమ్మ, డీఆర్వో**



గ్రామసభల్లో రైతులు ఇచ్చిన రీసర్వే సమస్యలను తహసీల్దార్, వీఆర్వో, సర్వేయర్లు కచ్చితంగా పరిష్కరించాలి. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆన్‌లైన్ సబ్ డివిజన్, మ్యు టేషన్ చేయాలి. రైతులను ఇబ్బంది పెట్టిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా గ్రామ రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను తీసుకోవాలి.

# ఎండలోనే మధ్యాహ్న భోజనం

- పందులు, కుక్కల మధ్య విద్యార్థుల అవస్థలు
- కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో దుస్థితి

**కోసిగి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన కోసిగిలోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 1400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే మధ్యాహ్న భోజనం సమయంలో పాఠశాల మైదానంలోని ఎండలో మధ్యాహ్న భోజనాన్ని వంట నిర్వాహకులు వడ్డిస్తున్నారు. దీంతో ఎండకు క్యూలో నిల్చుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వర్షాకాలంలోనూ ఇలాంటి ఇబ్బందులు పడుతున్నామని, చలికాలంలో కూడా ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భోజనం పాఠశాల మైదానంలో నేలపై కూర్చుని భోజనం చేస్తున్నామని, భోజనం చేస్తున్న సమయంలో పాఠశాల కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పందులు, కుక్కలు సరాసరి పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. భోజనం చేసే సమయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. చెట్ల కింద, నేలపైనే కూర్చుని భోజనం చేస్తున్నామని.. ఇదే సమయంలో పందులు వస్తుండటంతో తినలేకపోతున్నామని చెబుతున్నారు. పాఠశాలలోనే ఒక డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తే బావుంటుందని తెలుపుతున్నారు. అలాగే పాఠశాలలో పందులు, కుక్కలు రాకూండా కాంపౌండ్ వాల్, భోజనం చేసేందుకు డైనింగ్ హాలు నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు స్పందించి కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



మధ్యాహ్న భోజనానికి ఎండలో నిల్చున్న విద్యార్థులు



చెట్ల కింద నేలపైన కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు

# రైతుపై అల్పపీడనం

**రుద్రవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** బంగాళాఖాతంలో మ రో అల్పపీడనం ఏర్పడడంతో రైతన్నల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి. వరి కోతలు కోయడంతో ధాన్యం తడిచిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు తుఫాను ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మరో అల్పపీడనమనే సరికి కంటిమీదు కునుకులేకండా పోతోంది. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం జల్లులు కురవడంతో రైతులు రైతులు పరుగు పంట పొలాలకు వెళ్లి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. పంట పొలాలు, రహదారులపై ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి ట్రాక్టర్లతో గ్రామాలకు చేరవేస్తున్నారు



చిన్నకంబలూరులో ట్రాక్టర్లకు లోడు చేస్తున్న వరి ధాన్యం



చిన్నకంబలూరు సమీపంలో తడిసిన వరి ధాన్యాన్ని రహదారిపై పలకలతో లాగుతున్న కూలీలు



రుద్రవరం, వెలగలపల్లె సమీపంలో నేలవాలిన వరి పంట

## కష్టపడితే ఏదైనా సాధించవచ్చు

- క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్



క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

**కర్నూలు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** కష్టపడితే ఏదైనా సాధించవచ్చని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. బుధవారం వర్శిటీలో ఈనెల 21 నుంచి 28 వరకు కాలికట్‌లో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ ఫుట్ బాల్ టోర్నమెంట్‌కు వెళ్లే క్లస్టర్ వర్శిటీ టీమ్‌కు రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై శ్రద్ధ పెడితే స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని అన్నారు. స్పోర్ట్స్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడల్లో ఆడేందుకు 18 మంది సభ్యులు ఇద్దరు కోచ్‌లు వెళ్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, పక్కీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఉపకులపతి

**కర్నూలు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** డిగ్రీ 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు సెమిస్టర్ లాంగ్ ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్లు ఈనెల 21 లోపు పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో కర్నూలు, నంద్యాల జిల్లాల ఇంటర్న్‌షిప్ రిజిస్ట్రేషన్లపై వర్శిటీ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఇంటర్న్ షిప్ నోడల్ అధికార్లతో తన చాంబర్లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు, ఉన్నట విద్యామండలి ఆదేశాల మేరకు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న 92 డిగ్రీ కాలేజీల్లో బీఏ కోర్సుల కాంబినేషన్లో 1,422, బీకామ్‌లో 3,481, బీఎస్సీ 2,965, ఇతర కోర్సుల్లో 586 మంది విద్యార్థులతో కలిపి మొత్తం 8,454 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో సంబంధింత కళాశాలల ప్రిన్సిపాల్స్ తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు అన్నారు.

## రెవెన్యూ సదస్సులకు 324 అర్జీలు

వివరాలు వెల్లడించిన డీఆర్వో

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో బుధవారం 26 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 324 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని బైలుప్పల గ్రామంలో 10, నందవరం మండలంలోని మాచాపురం గ్రామంలో 3, ఎమ్మిగనూరు మండలంలోని దైవందిన్నె గ్రామంలో 14, కోసిగి మండలంలోని చింతకుంటలో 28, మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో 18 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అలాగే పెద్దకడుబూరు మండలంలోని గవిగట్టులో 1, ఆదోని మం డలంలోని ధనాపురం గ్రామంలో 10, వి.కొండాపురం గ్రామంలో 6, హొళగుం ద మండలంలోని గంజేహల్లిలో 10, కౌతాళం మండలంలోని తోవి గ్రామంలో 10 అర్జీలు వచ్చాయని చెప్పారు. కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్ మామిదాలపాడులో 14, ఓర్వకల్లు మండలంలోని లొద్దిపల్లెలో 50, కల్లూరు మండలంలోని ఉలిందకొండలో 14, వెల్దుర్తి మండలంలోని రామళ్లకో టలో 11, కోడుమూరు మం డలంలోని అమడగుంట్లలో 7 అర్జీలు వచ్చాయ న్నారు. కర్నూలు రూరల్‌లో దిన్నెదేవరపాడులో 24, గూడూరు మండలంలో ని మునగాల గ్రామంలో 12, సి.బెళగల్ మండలంలోని ఎం.సోమాపురంలో 3 అర్జీలు ఇచ్చారని చెప్పారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలంలోని కడమకుంట్ల గ్రామంలో 4, క్రిష్ణగిరి మండలంలోని సీహెచ్ ఎర్రగుడిలో 28, ఆలూరు మండలంలోని హోలిబీడులో 10, చిప్పగిరి మండ లంలోని దౌలతాపురంలో 8, ఆస్పరి మండలంలోని చిన్నహోతూరులో 8, హొళహర్వి మండలంలోని కొక్కెరచేడు గ్రామంలో 4 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఎంకేపల్లి గ్రామంలో 2, దేవనకొండ మండలంలో నేలటాలమర్రి గ్రామంలో 14 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో ఇంటి స్థలాలకు సంబంధించినవి 4, అసైన్డ్‌మెంట్స్ గవర్నమెంట్ ల్యాండ్‌కు సంబంధించి 18, క్యాస్ట్ సర్టిఫికెట్‌కు సంబంధించి 6, 22ఏలో ఉన్న నిషిద్ధ భూముల జాబితాకు సంబంధించినవి 18, రీసర్వేకు సంబంధించినవి 40, మీసేవ గ్రీవెన్స్‌కు సంబంధించి 9 భూసేకరణకు సంబంధించినవి 5, ఆర్‌వోఆర్ కేసులకు సంబంధించి 190 అర్జీలు వచ్చాయని తెలిపారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

• కలెక్టర్‌కు విన్నవించిన ఏపీయూడబ్ల్యూజే నేతలు



కలెక్టర్ రంజిత్ బాషాను సన్మానిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

**కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో వివిధ పేపర్లు, చానళ్లలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఐజేయూ జాతీయ సమితి సభ్యులు జి.కొండప్ప, కె.నాగరాజు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఎన్ రాజు, కే శ్రీనివాస్‌గౌడ్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి నవీన్ కుమార్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నాయకులు మధుసూదన్ గౌడ్, హుసేన్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శి అవినాష్ కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ స్కూల్స్‌లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పదేళ్లకు పైగా జర్నలిస్టులుగా పని చేస్తున్న చాలా మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేవన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో స్థలాలు ఇస్తామని చెప్పి తీరా ఎన్నికల సమయంలో హడావుడి చేసి చివరికి మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి అలా కాకుండా మొదట్లోనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థళాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్ బాషా, డీఈవో శ్యామ్యూల్ పాల్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజే శారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సబ్ ఎడిటర్లు తుమ్మల్ సాహెబ్, టీవీ మనోహర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, లక్ష్మన్న, మల్లికార్జున, మంజునాథ్, ప్రసాద్, రంగా, గంగాధర్, ఇంతియాజ్, వీడియో సూరి, చంద్రశేఖర్, రఫీ, శ్రీను పాల్గొన్నారు.

## డిగ్రీలో 13 మంది డీబార్

**కర్నూలు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** డిగ్రీ 1,3, 5 సెమిస్టర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు డీబారు అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని 64 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో 1వ సెమిస్టర్లో 10,504కు 9,125, 3, 5 సెమిస్టర్లలో 62 మంది దరఖాస్తు చేసుకోగ 48 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

## కందుల కొనుగోలు ప్రారంభం



కందులను పరిశీలిస్తున్న సహాయ కార్యదర్శి శాంత కుమార్

**ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి):** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బుధవారం కందుల కొనుగోలు ప్రారంభమైంది. పత్తికొండ నియోజకవర్గం పందికోన గ్రామానికి చెందిన రైతులు 20 క్వింటాళ్ల కంది దిగుబడిని విక్రయానికి తీసుకొచ్చారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి శాంత కుమార్ వ్యాపారులతో మాట్లాడి కందుల కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. కనిష్ఠ ధర రూ.8,151, గరిష్ఠ ధర రూ.8251 పలికింది.

## 22న నాటక అకాడమీ చైర్మన్ రాక



వివరాలు వెల్లడిస్తున్న పత్తి ఓబులయ్య

**కర్నూలు కల్చరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):** ఇటీవల ఏపీ నాటక అకాడమీ చైర్మన్‌గా రెండో పర్యాయం నియమితుడైన సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ ఈనెల 22న కర్నూలుకు విచ్చేస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. బుధవారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారుల సమస్యలను తెలుసుకొని, వాటిని ప్రభుత్వానికి నివేదించేందుకు నాటక అకాడమీ చైర్మన్ విచ్చేస్తున్నారని తెలిపారు. 22న మధ్యాహ్నం 3 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఉమ్మడి జిల్లా కళాకారులతో సదస్సు ఉంటుందని తెలిపారు.

**'జగదేక సుందరి సామా' పుస్తక ఆవిష్కరణ, నాటక ప్రదర్శన**

'చింతామణి' పద్యనాటకాన్ని గుర్తు చేసే మరో పద్యనాటకం 'జగదేక సుందరి సామా' పద్య నాటక పుస్తక ఆవిష్కరణ 22న సాయంత్రం 6 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఉంటుందని, అనంతరం కళాకారులతో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు పత్తి ఓబులయ్య తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభి స్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా శ్రీశైలం, పాణ్యం ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గౌరు చరితారెడ్డి హాజరవుతారని తెలిపారు. కళాక్షేత్రం ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మియా పాల్గొన్నారు.

## తలారి కుమారుడిపై దాడి

• ప్రైవేటు సర్వేయర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని టీఎస్ కూలూరు తలారి శీలమ్మ కుమారుడు మల్లికార్జునపై ప్రైవేటు సర్వేయర్ రామాంజనేయులు దాడి చేశాడు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సర్వేయర్ రామాంజనేయులను తమ పొలానికి చెందిన సర్వే మ్యాప్ స్కెచ్‌నే మరో వ్యక్తికి ఎలా ఇస్తారని మల్లికార్జున అడిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన సర్వేయర్ రామాంజనేయులు దాడి చేశాడు. మల్లికార్జునకు గాయాలయ్యాయి. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తలారి సంఘం నాయకులు చిన్నస్వామి మాట్లాడుతూ తలారులపై దాడి చేసిన ప్రైవేటు సర్వేయర్‌పై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. తహసీల్దార్‌ను వివరణ కోరగా గొడవకు సంబంధించిన విషయం తమకు తెలియదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

## భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

**బనగానపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మౌనికను తనను భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మౌనిక భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన నారాయణతో రామకృష్ణాపురానికి చెందిన మౌనికకు ఒకటిన్నర సంవత్సరం కింద వివాహమైంది. కట్నంగా రూ.3లక్షల నగదు, రూ.6 తులాల బంగారు ఇచ్చారు. అయితే వివాహం అయినప్పటినుంచి భర్త నారాయణ, అత్త చంద్రావతి, మామ నారాయణ అదనంగా రూ.2లక్షలు తేవాలని శారీరకంగా, మానసికంగా హింసిస్తుండే వారు. దీంతో మౌనిక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొంగటి ఉప్పరి లక్ష్మణ స్వామి తెలిపారు.

# రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు, కలెక్టర్, అధికారులు



స్టాల్స్‌ను పరిశీలిస్తూ..

• మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి
• ఆకట్టుకున్న వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలు

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం మైదానంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో కిసాన్‌మేళా కార్యక్రమాన్ని మంత్రులు, కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ఈ మేళాలో న్యాయ మంత్రి ఫరూక్, రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఎస్ఆర్బీసీ, తెలుగుగంగ, బానకచర్ల తదితర సాగునీటి ప్రాజెక్టులకు పునాది వేసి రాయలసీమ ప్రాంతానికి నీళ్లు అందిస్తారని అన్నారు. పోలవరం పూర్తయితే శ్రీశైలం వాటర్‌ను పుష్కలంగా రాయలసీమవాసులే వాడుకోవచ్చని మంత్రి తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు, అధిక దిగుబడి ఇచ్చే నూతన వ్యవసాయ విధానాలు అనుసరించాలని అన్నారు. వీటి ద్వారా వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను అందిస్తోందని వాటిని వినియోగించుకోవాలన్నారు. డ్రోన్ సదస్సు ద్వారా వ్యవసాయ రంగంలో రానున్న రోజుల్లో డ్రోన్‌ల వినియోగం మరింత పెరగనుందన్నారు. డ్రోన్‌ల ద్వారా స్ప్రే చేయడం రైతులకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 5.9 లక్షల ఎకరాలు సాగునీటి కాలువల కింద సాగవుతున్నాయని, రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకొని అందుకు అనుగుణంగా పంటలు వేసుకొని మంచి దిగుబడు సాధించాలన్నారు. చిరుధాన్యాలకు వ్యాల్యూ ఎడిషన్, ప్యాకింగ్, మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు కిసాన్ మేళాలో ఏర్పాటుచేసిన వ్యవసాయ ఉత్పత్తులను, ఏర్పాటుచేసిన స్టాళ్లను సైతం మంత్రులు, కలెక్టర్ పరిశీలించారు. వివిధగ్రామాల నుంచి రైతులు పండించి తీసుకొచ్చిన వ్యవసాయ ఉత్పత్తులు భళా అనిపించాయి. అనంతరం వ్యవసాయంలో నూతన ఆవిష్కరణల కోసం కృషిచేసిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను మంత్రులు సన్మానించారు. ఎమ్మెల్యేలు గౌరుచరితరెడ్డి, గిత్త జయసూర్య, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఏడీఆర్ డా. జాన్సన్, ఆచార్యఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శారదా జయలక్ష్మీ దేవి, బోర్డు మాజీ సభ్యులు భగీరధ చౌదరి పాల్గొన్నారు. .

## ప్రియుడిపై దాడిలో ప్రియురాలిదే స్కెచ్

**పోలీసుల విచారణలో వెల్లడి**

**గోనెగండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ప్రియుడిపై దాడి ఘటనలో ప్రియురాలిదే పక్కా స్కెచ్ అని తేలింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎమ్మిగనూరుకు చెందిన అరవిందు డిగ్రీ చదువుతున్నాడు. అదే సమయంలో ఇంటర్ మీడియట్ చదివే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరి మధ్య ప్రేమ పెళ్లి వరకు వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు తీవ్రంగా మందలించారు. దీంతో వీరి మధ్య ప్రేమ ఆగిపోయింది. అయితే ఈ అమ్మాయి ప్రస్తుతం బీటెక్ చదువుతోంది. అదే కాలేజీలో తన క్లాస్‌మేట్ అయిన మరో యువకుడిని ప్రేమించింది. వీరి మధ్య కొంత కాలంగా ప్రేమ వ్యవహారం సాగుతోంది. అయితే కొన్ని రోజుల తరువాత ఆ యువతికి మొదట ప్రేమించిన అరవిందుపై ధ్యాస మళ్లింది. అతడితో మళ్లీ ప్రేమాయణం మొదలుపెట్టింది. ఈ విషయం రెండో (బీటెక్ చదివే విద్యార్థికి) ప్రేమికుడికి తెలిసింది. దీంతో రెండో ప్రేమికుడు ప్రియురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. యువతి తన తప్పును కప్పి పుచ్చుకునేందుకు అరవిందే తనను వేధిస్తున్నాడని చెప్పింది. అతడిని గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గరకు తీసుకువస్తానని, అక్కడ తగిన రీతిలో బుద్ధి చెప్పమని రెండో ప్రియుడికి తన పథకం చెప్పింది. దీంతో దాడి ఘటనకు రెండు రోజుల ముందు గాజులదిన్నె ప్రాజెక్టు వచ్చి ఎక్కడికి తీసుకు రావాలి.. ఎక్కడ జనసంచారం తక్కువగా ఉంది.. అని రెక్కీ నిర్వహించి వెళ్లింది. పథకంలో భాగంగా మంగళవారం ఉదయం అరవిందు ఆ యువతి కసిసి స్కూటీపై ఎమ్మిగనూరు నుంచి గాజులదిన్నెకు బయలుదేరారు. మార్గమధ్యంలో తాము ఎక్కడికి పోతుంది.. ఎంత దూరంలో ఉన్నది అంతా మెసేజ్ ద్వారా రెండో ప్రియుడికి తెలుపుతూ వచ్చింది. ఇక గాజులదిన్నె ప్రాజెక్టు చేరుకొని ఎల్లెల్సీ దగ్గర ఉన్న ముళ్ల పొదలోకి వెళ్లారు.

దీంతో రెండో ప్రియుడు తన గ్రామానికి చెందిన ఇద్దరు మిత్రులను తీసుకొని వేటకొడవలితో వచ్చి అరవిందుపై దాడి చేశారు. అరవిందు కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాల వారు రాళ్లతో దాడి చేయడంతో దాడికి పాల్పడుతున్న ముగ్గురు పారిపోయారు. దాడి మొదలు కాగానే ప్రియురాలు పరారైంది. పోలీసులు దాడి జరిగి సంఘటన తె లుసుకొని విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో ఆ యువతి నాటకమంతా బయటపడినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై సీఐ గంగాధర్ వివరణ కోరగా కేసు విచారణ చేస్తున్నామని, గురువారం పూర్తి వివరాలు అందిస్తామని తెలిపారు.

## లోక్ అదాలత్‌లో మొదటి స్థానం



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్పీ జి. బిందుమాధవ్

• 7,913 కేసులు పరిష్కారం

**కర్నూలు క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల ఈ నెల 14న జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో 7,913 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. విజయనగరం రెండో స్థానంలో, కృష్ణా జిల్లా మూడో స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా ఎస్పీ జి.బిందుమాధవ్‌తో పాటు డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్‌బాబు, త్రీటౌన్ సీఐ శేషయ్య, కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ మనోహర్, త్రీటౌన్ కానిస్టేబుల్ జాన్సన్, తాలుకా కానిస్టేబుల్ తిక్కస్వాములను రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమల్‌రావు బుధవారం డీజీపీ కార్యాల యంలో ప్రత్యేకంగా అభినందించి ప్రశం సాపత్రాలను అందజేశారు.

ఈ కార్యక్ర మంలో సీఐడీ అడిషనల్ డీజీ డా. రవిశం కర్ అయ్యన్నార్, లా అండ్ ఆర్డర్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అమ్మకానికి జగనన్న కాలనీలు..

• అగ్రిమెంట్‌పై విచ్చలవిడిగా విక్రయాలు
• రద్దుకు నో చాన్స్ • మేస్త్రీలే రియల్టర్లు



ఓర్వకల్లులోని జగనన్న కాలనీ లే అవుట్

**ఓర్వకల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):**

గత వైసీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతింటి కళ నెరవేర్చాలనే లక్ష్యంతో పట్టణాల్లో ఒక సెంటు, పల్లెల్లో ఒకటిన్నర సెంటుతో పట్టాలు పంపిణీ చేసింది. కానీ చాలా ప్రాంతాల్లో నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేయడం, అనర్హులకు పట్టాలు ఇవ్వడంతో కాలనీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వైసీపీ బడా నాయకుల అండతో కొందరు ఇష్టానుసారంగా స్థలాలను ఆక్రమించుకుని ఆ స్థలాలను దళారుల ద్వారా అమ్మేసుకుని అందినకాడికి వెనకేసుకున్నారు. ఈ కోవకు చెందినవే ఓర్వకల్లు మండలంలోని జగనన్న కాలనీలు. గత ప్రభుత్వంలో ఓర్వకల్లులో ఊరి బయట జాతీయ రహదారికి సమీపంలో, నన్నూరులో రాగమయూరి సమీపాన లేఅవుట్లు వేసి జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు.

ఓర్వకల్లు మండలం పరిశ్రమల హబ్‌గా మారడంతో జగనన్న కాలనీలతో పాటు, కొన్ని సర్వే నెంబర్ల ప్రభుత్వ స్థలాలపై రియల్టర్లు, దళారుల కన్ను పడింది. గతంలో అన్ని ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలను కేటాయించి ఆరు నెలల్లోగా నిర్మించుకోవాలని, లేకుంటే పట్టాలు రద్దు చేస్తామని నిబంధనలు పెట్టేవి. కానీ గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అనర్హులకు ఏకంగా ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేయడంతో వాటిని రద్దుచేసే అవకాశం లేకుండా పోయింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అటు వైసీపీ నాయకులు, వలంటీర్లు, ఇటు రియల్టర్లు, దళారులు బినామి పేర్లతో పలు స్థలాలను, ప్లాట్లను సొంతం చేసుకుని ఈ స్థలాలను అగ్రిమెంట్ పేరుతో విక్రయించి కోట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెడితే అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూమిని సేకరించే ఇబ్బందులు తప్పుతాయి. ఓర్వకల్లు జగనన్న కాలనీలో నవరత్నాల పథకంలో భాగంగా 260 మందికి, నన్నూరులో 548 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. మూడేళ్ల క్రితం మోడల్ లేఅవుట్లు వేసి లబ్ధిదారులకు ఒకటిన్నర సెంట్ల చొప్పున ప్లాట్లు ఇచ్చారు. అంతా బాగానే ఉంది కానీ.. అర్హులైన లబ్ధిదారులకు కాకుండా వైసీపీ నాయకులు, వలంటీర్లు చెప్పిన వారికి ఇష్టారాజ్యంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పట్లో లబ్ధిదారులు రూ.1 చెల్లిస్తే ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇచ్చేశారు. దీంతో ఐదేళ్ల తర్వాత ఈ ఇళ్ల స్థలాలను విక్రయించుకునే వెసులుబాటు కూడా కల్పించారు.

**అగ్రిమెంట్లతో విక్రయాలు...**

ఓర్వకల్లు, నన్నూరు జగనన్న లే అవుట్లలో మొత్తం 808 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా వీటిలో చాలా వరకు వైసీపీ నాయకుల బినామీలు, వలంటీర్ల బినామీలకే కేటాయించి రిజిస్ట్రేషన్ కూడా చేయించి ఇచ్చారన్న విమర్శలున్నాయి. ఈ స్థలాలు కేటాయించి మూడేళ్లు గడుస్తున్నా కొన్ని స్థలాల్లో పునాదులు కూడా నిర్మించకపోగా.. కొన్ని బేస్‌మెంట్ లెవెల్, గోడలు నిర్మించి వదిలేశారు. ఇలాంటి అసంపూర్తి నిర్మాణాలను సుమారు 350 మంది లబ్ధిదారులు బేరాలు పెట్టి విక్రయించేశారు. లోతుగా విచారిస్తే ఈ స్థలాలను కొంత మంది ఒక్కో ప్లాటుకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు అగ్రిమెంట్ మీద విక్రయించారని తెలిసింది. అసలు లబ్ధిదారులు ఎక్కడో ఉంటే, తక్కువ ధరకే ప్లాటు వస్తుందని కొన్నవారు అగ్రిమెంట్లు చేసుకున్నారు.

ఈ ఇళ్ల స్థలాల్లో పునాదులు నిర్మించకుంటే కనీసం రద్దు చేసే అవకాశం కూడా లేకపోవడంతో ఈ స్థలాల విక్రయాల ద్వారా పెద్ద మొత్తంలో అక్రమార్కుల చేతులు మారినట్లు సమాచారం. ఆశ్చర్యక రమైన విషయం ఏమిటంటే ఇళ్ల నిర్మాణాలను తీసుకున్న మేస్త్రీలే రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారారు. వీరు అసం పూర్తి నిర్మాణాలను లబ్ధిదారుల వద్ద నుంచి తక్కువ ధరకు కొని కట్టిస్తారు. వాటిని ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయించి లక్షల్లో సంపాదిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై రెవెన్యూ, హౌసింగ్ అధికారులు లోతుగా విచారిస్తే అక్రమార్కుల గుట్టు బయటపెట్టి అసలైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలవుతుంది. అదేవిధంగా కొన్ని గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి కాకపోయినా పూర్తి స్థాయి బిల్లులు చేయడం జరిగిందని సమాచారం. వీటిపై విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జగనన్న కాలనీల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి**



గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలలో చాలా వరకు అనర్హులకు, స్థానికేతరులకు ప్లాట్లు కేటాయించారు. వైసీపీ నాయకుల అండతో కొందరు అనేక అక్రమాలకు పాల్పడి రూ. లక్షలు దండుకున్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలి.

- గోవిందరెడ్డి, ఓర్వకల్లు

**అక్రమాలపై విచారణ చేస్తాం**



జగనన్న కాలనీల్లో ప్లాట్లను కొందరు లబ్ధిదారులు విక్రయించినట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలనీల్లో ప్లాట్లు అమ్మడం, కొనడం నేరం. దీనిపై విచారణ చేపడతాం. ఇళ్ల స్థలాల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలతో తదుపరి చర్యలు చేపడతాము. - రామయ్య, హౌసింగ్ ఏఈ, ఓర్వకల్లు

## రివర్స్‌లో వాహనం ఢీకొని మహిళ మృతి

**ఓర్వకల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నన్నూరు సమీపంలో గల రాగమయూరి రోడ్డు నెంబర్ 16లో క్లాసిక్ అపార్టుమెంటులో నివాసముంటున్న గొల్ల చంద్రమ్మ (50) ఓ వాహ నం రివర్సులో ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందారు. చంద్రమ్మ తన నివాసానికి సమీపంలో గొర్రెలు మేప డానికి వెళ్లారు. అనంతరం గొర్రెలను ఇంటికి తరలిస్తున్న సమయంలో రోడ్డుపై ఓ వాహనం రివర్సులో ఢీకొ ట్టింది. తలకు, చేయికి గాయాలై అక్కడి కక్కడే మహిళ మృతి చెందింది భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు

## 'దేశాభివృద్ధికి విద్యా వ్యవస్థే కీలకం'



సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ డాక్టర్ శంకర్

**పాణ్యం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** దేశాభివృద్ధికి విద్యా వ్యవస్థే కీలకమని రాజమండ్రి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శంకర్ అన్నారు. బుధవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రిటీ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. ప్రపంచానికి విలువైన మేధావులను, సాంకేతిక శాస్త్రవేత్తలను అందించిందని అన్నారు. మాతృ భాషనుకాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. దేశంలో విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందితే దేశం బలంగా ఉంటుందన్నారు. పురాతన ఆలయాలలోని శిల్పకళ మరెక్కడా లేదన్నారు. నేటి విద్యార్థుల ఆచార్యుల ద్వారా సరైన విజ్ఞానాన్ని పొందలేకపోతున్నారని అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు తమ మేధోసంపత్తిని మెరుగుపర్చుకోవాలన్నారు. సంస్కృతి మన జీవన గమ్యాన్ని నిర్ణయిస్తుందన్నారు. నేటి విద్యార్థులు తమ తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని చదువుపై దృష్టిని సారించాలన్నారు. పరిచయంలేని వ్యక్తుల మాటలను నమ్మరాదన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డాక్టర్ సోఫియా ప్రియదర్శిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి'

**గడివేముల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పంచాయతీలోని సమస్యలపై దృష్టి సారించాలని డీఎల్పీవో రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా, ఈవోఆర్డీ మహిధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'భూ సమస్యల పరిష్కారానికి కృషి'

**పాణ్యం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. చిలకల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయరు నాగరాజు, వీఆర్వో శంకర్, క్రిష్టియానమ్మ, సాగునీటి సంఘం అధ్యక్షుడు మోహన్, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మండంలోని కరివేన గ్రామంలో అగ్రహారానికి చెందిన భూసమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ శివశంకరశర్మ తహసీల్దార్ రత్న రాధికను కోరారు. బుధవారం మండలంలోని కరివేన గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కిసాన్ మేళాకు విశేష స్పందన



డ్రోన్ గురించి తెలుసుకుంటున్న రైతులు

**నంద్యాల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమం అనంతపురం. అన్నమయ్య, కర్నూల్, నంద్యాల జిల్లాలకు చెందిన రైతన్నలను ఆకర్షించింది. ఇందులో ఆధునిక సాంకేతిక వ్యవసాయ విజ్ఞానాన్ని ఇనమడింపజేయడానికి ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లు రైతన్నలను ఆకర్షించాయి. అందులో ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన, వ్యవసాయ, యాంత్రీకరణ, డ్రోన్లు, స్పింకర్లు, బిందు సేద్యంతో పాటు పలు రకాల ప్రదర్శనలు నూతన ఒరవడిని కలిగి ఉన్నాయి. ప్రతిరైతు డ్రోన్ల గురించి తెలుసుకోవడానికి ఆసక్తిని కనబరిచారు. ప్రభుత్వ స్టాళ్లు 10, ప్రైవేట్ స్టాల్స్ 40 దాకా ఏర్పాటు చేశారు.

## దెబ్బతిన్న కాలువలు

● మరమ్మతులకు నోచుకోని కేసీ తూములు



ఈర్నపాడు వద్ద దెబ్బతిన్న కేసీ కాలువ సిమెంట్ లైనింగ్

**బండిఆత్మకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** కర్నూలు-కడప కెనాల్ సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్నాయి. దాదాపు 20 ఏళ్ల క్రితం జెపాన్ నిధులతో ఉమ్మడి కర్నూలు జిల్లా, కడప జిల్లాల్లోని కేసీ కెనాల్‌కు అప్పటి ప్రభుత్వం సిమెంట్ లైనింగ్ పూర్తి చేసింది. నాటి నుంచి నేటి వరకు లైనింగ్ దెబ్బతిన్నా ఇంతవరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. అలాగే భోజనం, సంతజూటూరు గ్రామాల మధ్య కేసీ కెనాల్ చాలా వరకు అన్యాక్రాంతం అయింది. తూములు, సైడ్‌వాల్స్ దెబ్బతిన్నా పట్టించుకోవటం లేదు. గతంలో కేసీ కెనాల్ ఇలాంటి దెబ్బతిన్న ప్రదేశాల వద్ద గండ్లు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరమ్మతులు చేట్టాలని రైతులు కోరుతున్నారు.



భోజనం గ్రామ పరిధిలో దెబ్బతిన్న కేసీ తూము

# రైతులు వర్రీ

● 75 కేజీల వరి ధాన్యం బస్తా రూ.1600 లోపే

● తక్కువ ధర చెల్లిస్తున్న దళారులు



పగిడ్యాల సమీపంలో మిషన్‌తో వరి పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం

**పగిడ్యాల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** వరికి కనీస ధర లేకపోవడంతో నష్టాలో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉన్నప్పటికీ ధాన్యానికి సరైన ధరలు లేకపోవడంతో పెట్టుబడులకు చేసిన ఖర్చులు కూడ వస్తాయో లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని పగిడ్యాల, సంకిరేణిపల్లె, బీరవోలు, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, ప్రాతకోట, ఘనపురం గ్రామాల్లో కేసీ కాలువ కింద రైతులు ప్రధానంగా వరి పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురువడంతో కేసీ కాలువకు సకాలంలో నీరు విడుదల చేయడంతో ఖరీఫ్‌లో ఆయా గ్రామాల్లో సుమారు 575 హెక్టర్లకు పైగా సోన రకం వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రస్తుతం రైతులు వరి పంటలను మిషన్ల ద్వారా కోతలు కొసి కళ్లాలో ఆరబెట్టుకుంటున్నారు. ఎకరాకు 30-35 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు తెలిపారు. అయితే 75 కేజీల వరి ధాన్యానికి కేవలం రూ. 1500 నుంచి 1600లోపు దళారులు కొనుగోలు చేస్తుండటంతో పంటల సాగుకు చేసిన ఖర్చులకు సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎకరా వరి పొలాన్ని మిషన్ల ద్వారా నూర్పిడి చేస్తే రూ.2000 చెల్లించేవారమని, అయితే ఈ ఏడాది మిషన్‌ల ద్వారా నూర్పిడి చేస్తే మిషన్ యజమానులు గంటకు రూ.3 వేల తీసుకుంటున్నట్లు రైతులు చెప్పారు. పంటల సాగు కోసం సేద్యం, కూలీలు, ఎరువుల ధరలు పెరగడంతో ఎకరాకు రూ. 35 వేలకు పైగా ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. గత ఏడాది 75 కేజీల వరి బస్తా ధర రూ.2వేల వరకు ఉండేదని, ఈ ఏడాది వరి ధాన్యానికి కనీస ధర లేకపోవడంతో పండించిన దాన్యం ఖర్చులకే సరిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యానికి ధర లేకపోవడంతో రైతులు దాన్యాన్ని ఇండ్లలో నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పంటల సాగు కోసం తీసుకొని వచ్చిన అప్పులు కూడా తీర్చే పరిస్థితి కనబడటం లేదని రైతులు అంటున్నారు. తమ పరిస్థితి మరింత దయనీయంగా మారిందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికి కనీస కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనాలని అన్నదాతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఖర్చులకే సరిపోతాయి



వరి దాన్యానికి ధర లేకపోవడంతో పండిన దాన్యాని విక్రయిస్తే వచ్చిన సొమ్ము ఖర్చులకే సరిపోతుంది. గత ఏడాది వరి దాన్యం బస్తా ధర రూ. 2000 వరకు ఉండేది, ప్రస్తుతం దిగుబడి ఘననీయంగా ఉన్న ధర లేకపోవడంతో నష్టపోవాల్సివస్తుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఎర్పాటు చేసి దాన్యని కోనుగోలు చేయాల్సిన అవసరం ఉంది.

- నాగేష్, రైతు, నెహ్రూనగర్

## 'ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

**ఆత్మకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** ఇంధనాన్ని పొదుపుగా వాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు విద్యుత్ కొరత లేకుండా చేయవచ్చని విద్యుత్ శాఖ డీఈ జయశంకర్ అన్నారు. బుధవారం జాతీయ విద్యుత్ ఇంధన వారోత్సవాలను పురస్కరించుకుని ఆ శాఖ ఉద్యోగులు విద్యుత్ పొదుపు గురించి పట్టణంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు దేశంలో విద్యుత్ వినియోగం పెరుగుతోందని, దీన్ని తగ్గించేందుకు సంప్రదాయమైన ఇంధన వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి ఎల్ఈడీ బల్బుల వినియోగం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. అదేవిధంగా సోలార్ విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అవసరంగా జరుగుతున్న విద్యుత్ వృధాను అరికట్టాలని అన్నారు. అనంతరం విద్యుత్ ఆదాపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'శిక్షణను సద్వినియోగం చేసుకోండి'



రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయిస్తున్న సీఐ రాము

**ఆత్మకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రాథమిక పరీక్షకు అర్హత సాధించిన దేహదారుడ్య, ఫైనల్ పరీక్షలకు సంబంధించిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ సీఐ రాము సూచించారు. బుధవారం ఆయన స్వయంగా క్రీడా ప్రాంగ ణంలో 1600 మీటర్లు, 100మీటర్లు, లాంగ్ జంప్ ట్రాక్‌లను ఏర్పాటు చేయించడంతో పాటు ప్రాథమిక పరీక్షలో నెగ్గిన అభ్యర్థులకు దేహ దారుడ్య, ఫైనల్ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇప్పించనున్నట్లు తెలి పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక పోలీసు స్టేషన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

## 'సుస్థిర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి'




మాట్లాడుతున్న జిల్లా రిసోర్సు అధికారి గిడ్డేశ్వర్లు

**మిడుతూరు, డిసెంబరు 18( ఆంధ్రజ్యోతి):** గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా రీసోర్సు పర్సన్ గిడ్డేశ్వర్లు సూచించారు. మిడుతూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దశరథరామయ్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా రిసోర్సు పర్సన్‌తో పాటు డీఎల్‌పీవో రాంబాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న వనరులతో ప్రస్తుత అవసరాలు తీర్చుకుంటూ భవిష్యత్తు తరాలకు ప్రణాళిక బద్ధమైన విధానాలు అయిన పేదరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన గ్రామం, మహిళ, బాలల స్నేహపూరిత గ్రామంగా, పరిశుభ్రత, తాగునీరు, మౌలిక వసతులు ఉపాధి కల్పన, పొదుపు, పెట్టుబడుల పట్ల అవగాహన ఉన్నప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈవోఆర్డీ సంజన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకా దేవి, పీఆర్ ఏఈ ప్రతాప్ రెడ్డి, ఏపీఎం సుబ్బయ్య, ఏపీవో జయంతి పాల్గొన్నారు.

## కలెక్టర్ దృష్టికి ప్రజా సమస్యలు



కలెక్టర్ రాజకుమారితో మాట్లాడుతున్న బైరెడ్డి

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని ప్రజల సమస్యలను మాజీ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం సాయంత్రం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కార్యాలయం వద్దకు వచ్చిన రైతుల సమస్యలు కలెక్టర్, జేసీ వద్దకు తీసుకెళ్లారు. కలెక్టర్ రాజకుమారి స్పందించి రైతుల భూసమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి ముందు ఉన్న 27 చిరు వ్యాపార కుటుంబాల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఎస్పీ చిరువ్యాపారుల కుటుంబాలకు భరోసా ఇచ్చారని తెలిపారు.

## సారా స్థావరాలపై దాడులు

**నందికొట్కూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** నందికొట్కూరు పట్టణంలోని నీలిషికారి పేటలో బుధవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 500 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారాను ధ్వంసం చేయడంతో పాటు మరో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో షికారి దుర్గ(29)పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడుల్లో నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం, కానిస్టేబుళ్లు శివన్న, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్

**నంద్యాల కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల ఎస్పీజీ మైదానంలో బుధవారం సాయంత్రం కల్వరీ టెంపుల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్వరీ టెంపుల్ కమిటీ మెంబర్స్ అశోక్, విన్సెంట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ సతీష్ కుమార్ హాజరై ప్రసంగించారు. క్రిస్మస్ నాటిక, చిన్నారులతో కల్చరల్ ప్రోగ్రామ్స్, స్కై ల్యాంతర్లు, క్యాండిల్‌లైట్ సర్వీస్, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్వరి టెంపుల్ బ్రదర్స్ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణను వాయిదా వేయాలి: ఏపీటీఎఫ్



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

**నంద్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డీఈవోను కోరారు. బుధవారం నంద్యాలలోని డీఈవో కార్యాలయంలో ఏపీటీఎఫ్ నాయకులు డీఈవో జనార్దన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ శిక్షణాకార్యక్రమాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారన్నారు. ఒకే నెలలో 4శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం సరికాదని, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి, లీడర్‌షిప్, గౌడ్స్ అండ్ స్కౌట్స్, జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలు వరుసగా ఆరు రోజులు, మూడురోజులు ఏర్పాటు చేయడంతో బోధనకు దూరం కావాల్సి వస్తుందన్నారు. చాలా మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండటంతో ఒక్కో శిక్షణాకార్యక్రమానికి ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులను పంపాల్సిరావడంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేకపోతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ నెలలో ఎస్ఏ-1 పరీక్షలుండటంతో పేపర్ వ్యాల్యూయేషన్, సిలబస్ పూర్తిచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉండటంతో శిక్షణాకార్యక్రమాలు ఆటంకంగా మారాయన్నారు. కార్యక్రమాలను వాయిదావేసి వేసవి సీజన్‌లో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుందర్‌రావు, రాజ్‌కుమార్, దస్తగిరిబాషా, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పనిచేయని బోరు

● మరమ్మతులకు గురైన తాగునీటి బోరు

● దాహం తీర్చుకోవడానికి బాటసారుల అవస్థలు

**కొత్తపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణ శివారులోని తాగునీటి బోరు మరమ్మతులకు గురై ఏడాది గడుస్తోంది. దీంతో కొత్తపల్లి మండలానికి వెళ్లే ప్రజలతో పాటు సమీప ఇటుక బట్టీల కూలీలు, కొలను భారతి, సంగమేశ్వరం వెళ్లే భక్తులు సైతం తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్ల క్రితం ఆత్మకూరు పట్టణ శివారులోని ఇటుకల బట్టీల వద్ద ఓ భారీ వృక్షం కింద బాటసారుల తాగునీటి కోసం ఆత్మకూరు మున్సిపల్ అధికారులు అక్కడ ఓ బోరును ఏర్పాటు చేశారు. దీంతో అక్కడే ఈ ప్రాంతం గుండా వెళ్లేవారు కొద్దిసేపు సేద తీరేవారు. అయితే బోరు మరమ్మతులకు గురైనా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, బాటసారులు వాపోతున్నారు. ఇప్పటికైనా బోరు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మరమ్మతులకు గురైన బోరు

## శ్రీశైలంలో విశేష పూజలు

**శ్రీశైలం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం దేవస్థానంలో బుధవారం లోకకల్యాణార్థం సాక్షి గణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని చేశారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

## అలరించిన నృత్య ప్రదర్శన




నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

**శ్రీశైలం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం సాయంత్రం శ్రీశైలానికి చెందిన సాయి నృత్య కళాశాల బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శివతాండవం, నమోనమో నటరాజ తదితర గీతాలకు అమృత, రామతులసి, సర్వజ్ఞ, అర్చన, వరలక్ష్మి, వెంకటపూజిత తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

## 'రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు'




సూచిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

**నంద్యాల క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో రోడ్ల భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోకి ప్రవేశించే వివిధ మార్గాల్లో ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. చాపిరేవుల, వెంకటేశ్వరపురం, రైతునగరం, అయ్యలూరి మెట్ట తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద సంకేత సూచికలతో కూడిన సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలో వివిధ బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా, వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాదాల గుర్తింపు సూచికల బోర్డులు, జిగ్‌జాగ్ బారికేడింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రజలు రోడ్డుప్రమాదాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు పోలీస్ అధికారులు చెప్పారు.

## వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

**పాములపాడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** పాములపాడు లోని కేజీ రహదారిలో ఎస్ఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. గతంలో ఫైన్‌లు కట్టని వాహనాలను గుర్తించి వాహనదారుల నుంచి చలానా లను కట్టించారు. ఎస్ఐ మాట్లాడతూడిః మాట్లాడుతూ సకాలంలో చలానాలు కట్టాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

## అవినీతిపై విచారణ చేపట్టాలి: సీపీఎం



నిరుపయోగంగా ఉన్న ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

**నందికొట్కూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** గత వైసీపీ ప్రభుత్వంలో పట్టణంలో నిర్మించిన జగనన్న కాలనీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని జగనన్న కాలనీని బుధవారం సీపీఎం నాయకులు సందర్శించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ లేఅవుట్ ఒకటిలో విద్యుత్ మోటారు కాలిపోవడంతో తాగునీటి సదుపాయం నిలిచిపోయిందన్నారు. రోడ్లకు కంకర వేసి వదిలిపెట్టారని, దీంతో వాహనదారులు జారి పడుతున్నారని అన్నారు. జగన్ కాలనీలో రోడ్లు, కరెంటు, తాగునీటి పైప్‌లైన్, చిన్న చిన్న ట్యాంకుల నిర్మాణం, సున్నం, మంచినీటి బోర్లు తదితర వాటిపైన పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, దూదేకుల బాబు, నాగన్న, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

## వినోద్ మిశ్రాకు ఘన నివాళి

**నందికొట్కూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ముఖ్య నాయకుడైన వినోద్ మిశ్రా 26వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏఐకేఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, నాగార్జున ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

## 'వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

**నంద్యాల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కోరారు. బుధవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాలో పాల్గొన్న మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ఎదుట విన్నవించారు. తక్కువ ధరకే విక్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వన్యప్రాణి వేటగాళ్లపై అటవీ అధికారుల దాడులు?

**ఆత్మకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** సిద్ధాపురం, ముష్టేపల్లి పరిసర అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయించడానికి వేటగాళ్లు బుధవారం రాత్రి ఆత్మకూరు పట్టణానికి వస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది కాపు కాసి వారిని పట్టుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. వేటగాళ్లు వన్యప్రాణుల మాంసాన్ని కొత్తపేట కాలనీలో వదిలి పరారైనట్లు సమాచారం. వేటగాళ్లను పట్టుకునే క్రమంలో అటవీ సిబ్బంది బైకు కొత్తపేటలో ఓ బైకును ఢీకొట్టగా ఓ బాలుడు గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. వివరణ కోరేందుకు అటవీ శాఖ ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

## వైభవంగా ధనుర్మాస పూజలు



చాగలమర్రి కోదండరామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని పట్టాభిరామ, చెన్నకేశవ, కోదండరామ, మద్దూరు గ్రామంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. చెన్నకేశవ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామాలయంలో సీతారాములకు మహిళలు క్షీరాభిషేకం, సామూహిక వడిబియ్యం, పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో వర్షం

**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి మండలంలో బుధవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని రహదారులు, కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసింది. అకాల వర్షం రావడంతో రైతులు ఆందోళన చెందారు. కొందరు రైతులు ధాన్యం తడవకుండా పట్టలు కప్పుకునే ప్రయత్నం చేశారు. మరో రెండు రోజులు తుఫాన్ ప్రభావం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## 'టీడీపీతోనే పేదల సంక్షేమం'

**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో అన్సర్‌బాషా, జెట్టినాగరాజు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనీఫ్, నర్సిరెడ్డి, జల్లానగౌస్, బారిక్‌చామల్, హుసేన్‌సా, గఫార్, రాజేష్, జిలేబి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో గ్రేడింగ్ పెంచాలి

**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని బుగ్గరస్తా వీధిలోగల ప్రాథమిక పాఠశాల, మద్దూరుగ్రామంలో గల ప్రాథమిక, ఉన్నత, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వంట తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ

**రుద్రవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాలో చైల్డ్‌ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీలు నిర్వహిస్తున్నట్లు డీజీపీవో జబీబుల్లా తెలిపారు. బుధవారం రుద్రవరం ఎల్‌ఎస్‌డీజీఎస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉమెన్స్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీలపై అధికారులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలకు మంచి ఆరోగ్యం, ఆహార భద్రత ఇంకా పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

## నల్లమలలో వన్యప్రాణుల గణన



ఫారెస్టు అధికారులతో టైగర్ ఎన్‌ఎస్‌టీఆర్ టైగర్ రీసెర్స్ పర్సన్ శ్రీధర్

**రుద్రవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** నల్లమలలో శాఖాహారం, మాంసాహారం వన్యప్రాణుల గణనపై ఎన్‌ఎస్‌టీఆర్ రిసోర్స్ పర్సన్ శ్రీధర్ అవగాహన కల్పించారు. బుధవారం రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లోని నూతల సెక్షన్‌లో శిక్షణ నిర్వహించారు. శాఖాహార జంతువుల కోసం ట్రాన్సాక్ట్ లైన్ రెండు కి మీ, ట్రైల్ పాత్ మాంసాహార జంతువుల కోసం ఐదు కిలోమీటర్లు, ఫారెస్టు విజిట్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ కొనసాగించాలని సూచించారు. ఎయిడెస్ ప్రోగ్రాంలో అధికారులు అడవిలో ఎన్నిరకాల మాంసాహారం, శాఖాహారం జంతులు ఉన్నాయో, ఏఏ జాతుల చెట్లు ఉన్నాయో గుర్తించాలన్నారు. నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజవల్లి, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌ఖాన్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

**రుద్రవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఆటో యాత్రికుడు అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఆటోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కెపాసిటికి మించి వాహనాల్లో ప్రయాణించరాదన్నారు.

## హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ రాముడు ఆధ్వర్యంలో హోటళ్లలోని ఆహార పదార్థాలు, నిల్వలను పరి శీలించారు. అనుమానం ఉన్న పదార్థాలను శాంపిల్‌గా సేకరించి హైదరాబాదు ల్యాబ్‌కు పంపిస్తామని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే హోటళ్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఉపకారాగారం తనిఖీ

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఉపకారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి లీలావెంకటశేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. ఉప కారాగారంలోని ఖైదీల వివరాలు, వారికి అందిస్తున్న వసతులు, సౌకర్యాలతో పాటు రికార్డులను తనిఖీ చేశారు.

## ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు : ఈవో

**బనగానపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** రోడ్డుకు అడ్డుగా వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించవద్దని బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలి వద్ద రోడ్డుకు అడ్డంగా పెట్టిన ఆటో వాహన డ్రైవర్లకు, కూరగాయలు అమ్మేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పెట్రోల్ బంకు వద్ద కూరగాయలు అమ్మవద్దని, మార్కెట్‌లో విక్రయించుకోవాలని ఈవో సూచించారు.

## అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శివప్రసాద్‌రావు

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బత్తిన శివప్రసాద్ నియమితులయ్యారు. దొర్నిపాడు మండలం రామచంద్రా పురం గ్రామానికి చెందిన శివప్రసాద్‌రావు అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం ఏపీపీగా నియమించింది. ఆళ్లగడ్డ సబ్‌జైల్ ప్యానల్ అడ్వకేట్‌గా ఐదేళ్ల పాటు ఆయన సేవలు అందించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో ఏపీపీగా అవకాశం లభించిందని అన్నారు. ఏపీపీ శివప్రసాద్‌రావును పలువురు న్యాయవాదులు అభినందించారు.

# పంటలపై పందుల దాడి

- బెంబేలెత్తుతున్న రైతులు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు



పందుల దాడిలో దెబ్బతిన్న వరి పంట

**కొలిమిగుండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని పలు గ్రామాల్లో పందుల బెడద తీవ్రమైంది. ప్రధానంగా పంటలపై దాడులు చేస్తుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. పందుల బెడదను అరి కట్టాలని రైతులు, ప్రజలు మొరపెట్టుకుంటున్నా అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. పందుల బెడద గ్రామీణ రైతులకు గుదిబండగా మా రింది. మండలంలోని కల్వటాల, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె, బెలుం తదిత ర గ్రామాల్లో సాగు చేసిన వరి, పప్పు శనగ, మొక్క జొన్న తదితర పం టలపై పందులు దాడి చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు మనో హర్‌రెడ్డి, చిన్ని, రమణ, బాలుడు తదితర రైతులు వాపోయారు. అలాగే కొలిమిగుండ్ల, కల్వటాల, ఇటిక్యాల గ్రామాలకు చెందిన పలువురు రైతుల పం టలు



విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు

పందుల దాడిలో దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు పలుమార్లు ఎంపీడీవో కార్యాలయంలో, పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామాల్లో విచ్చవిడిగా సంచరిస్తున్న పందులు పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందుల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల ఉదాసీనత**

పందుల బెడదతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పంచాయతీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూకుమ్మడిగా ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పందుల బెడదను నిర్మూలించాలని కోరుతున్నారు.

# భయం వీడితేనే విజేతలవుతారు : డీఈవో



సంజామల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

**సంజామల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):** పరీక్షలంటే భయం వీడితేనే విజేతలవుతారని డీఈవో జనార్దన్ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈవోలు రాజయ్య, ఈశ్వరయ్యలతో కలిసి పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పదవ తరగతి విద్యార్థులు పరీక్షల భయం వీడాలన్నారు. భయపడితే ఏమి చేయలేరన్నారు. ఇష్టపడి చదివి ఉల్లాసంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి విజేతలవ్వాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణకు అలవాటు చేస్తున్న పీఈటీ బాషాను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**వందశాతం ఫలితాలు సాధించాలి**

**కొవెలకుంట్ల :** పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని నంద్యాల జిల్లా విద్యా శాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కొవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారి కోసం ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు మంచి ఫలితాలు రాబట్టేలా కృషి చేయాలన్నారు. అలాగే పాఠశాల ఆవరణలో ప్రతి విద్యార్థి మొక్క నాటి సంరక్షించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఆహ్లాదకర వాతావరణం కలిగినప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి చొరవతో పెండింగ్ ఫైళ్లకు మోక్షం



మంత్రికి సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు

**బనగానపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో పెండింగ్‌లో ఉన్న భవన కార్మికులు, గని కార్మికుల డెత్ క్లయిమ్‌లకు మోక్షం లభించిందని సీపీఎం జిల్లా నాయకులు సుధాకర్ అన్నారు. బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు రెడ్డిబపల్లె ఓబయ్య, సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, బీసీ సంఘం నాయకులు వడ్డెసుబ్బరాయుడు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి సమ స్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. స్పందించిన బీసీ ప్రత్యేక చొరవ తీసుకొని 30 పెండింగ్ ఫైల్స్‌ను జిల్లా లేబర్ కమిషనర్‌కు పంపారు. బాధిత కుటుంబాల పక్షాన నిలబడి నష్టపరిహారం అందేందుకు మంత్రి కృషి చేయడం హర్షనీయమని సీపీఎం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు రాతపుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందాచారి

**బనగానపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి సూచించారు. బుధవారం మండలంలోని బీరవోలు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్రహ్మానందాచారి ప్రొద్దుటూరుకు చెందిన హైహెల్ప్‌యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాతపుస్తకాలు పంపిణీ చేశారు. అబ్దుల్‌కలాం గొప్పదనాన్ని గురించి వివరించారు. పేదకుటుంబంలో జన్మించి పేపర్‌బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించిన అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఎదిగారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమలో ఉపాధ్యాయుడు రాఘవేద్రం, రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కూలీలందరూ వేతనం పొందాలి: ఏపీడీ

**బేతంచెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలీకి రూ.300 కనీస వేతనం పొందేలా పనులు చేయాలని ఏపీడీ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంబాపురం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. పని చేసే కూలీల మస్టర్లు పరిశీలించి రోజువారి వేతనం రూ.300 పొందేలా పని చేయాలని తెలిపారు. కొలతల ప్రకారం క్రమంగా పని చేయాలని తెలిపారు. సమయపాలన పాటించాలని, మస్టర్లలో పేర్లు నమోదు చేయాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో శేషన్న, ఈసీ సుబ్బానాయక్, శంకర్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, ఉపాధి కూలీలు ఉన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

**సంజామల, డిసెంబరు 18:** సైబర్ మోసాగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. బుధవారం నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, మోసాలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్, బ్యాంకు సమాచారం అడిగితే ఇవ్వరాదన్నారు. అలాంటి ఘటన ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ముస్లింలు తమ హక్కులు తెలుసుకోవాలి

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** ముస్లింలు తప్పనిసరిగా తమ హక్కులను తెలుసుకోవాలని ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల బాష అన్నారు. బుధవారం పట్టణంలో జాయింట్ యాక్షన్ కమిటీ, ఆవాజ్ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆవాజ్ కమిటీ నాయకులు నిజాముద్దీన్, బాజన్, బర్కాత్ బాబా, గౌస్ పీర్, అబ్దుల్‌ఖాదర్, ఇస్మాయిల్ బేగ్ పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



డోన్ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమణి

**డోన్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ నాగమణి అన్నారు. బుధవారం పట్టణంలోని పాతపేట రాములవారి గుడి ఆవరణలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డోన్ రెవెన్యూ పరిధిలోని సమీప గ్రామాలైన ధర్మవరం, ఎర్రగుంట్ల, దొరపల్లి, వెంకటనాయునిపల్లె గ్రామాలతో పాటు డోన్ పట్టణం ఇందిరానగర్, కొండపేట, పాతపేట, శ్రీరామ్‌నగర్, కేవీఎస్ కాలనీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజలు, రైతులు అర్జీలు అందజేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**కోవెలకుంట్ల :** రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకునే ప్రతి అర్జీ పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సౌదరదిన్నె సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, మండల సర్వేయరు వీరన్న, వీఆర్వోలు మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

**బేతంచెర్ల :** రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ వివాదాలు, భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ ప్రకాష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ముద్దవరం గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 18మంది రైతులు భూవివాదాలకు సంబంధించి అర్జీలు అందజేశారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ మారుతి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

**చాగలమర్రి:** భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కలుగొట్లపల్లె గ్రామంలో సర్పంచ్ దస్తగిరిరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ప్రసాద్, శిఖామణి, సుబ్బరాయుడు, పద్మశేఖర్, సర్వేయర్ ప్రకాష్, టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, బాలిరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

**రుద్రవరం :** మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో తహసీల్దారు మల్లిఖార్జునరావు అధ్యక్షత బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 18మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, సర్వేయరు రమణ, వీఆర్వోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**దొర్నిపాడు:** మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతుల భూసమస్యలు పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర అన్నారు. బుధవారం మండలంలోని గుండుపాపల గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీఆర్వో మురళీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### రైతులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు

- జమాల్‌వలి, ఏఈ, కేసీకెనాల్



**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** కేసీకెనాల్ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది వరి సాగుకు నీరందిస్తున్నందున రైతులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామని కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు తీసుకున్నాం. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

**ప్రశ్న:** పంట కాలువల పరిస్థితి ఏమిటి?

**జవాబు:** కాలువలకు ఇబ్బంది లేదు. ప్రధాన కాలువతో పాటు పంట కాలువలకు కూడా నీటి పారుదలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

**ప్రశ్న:** కేసీ కాలువలో ఎన్ని క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది?

**జవాబు:** రాజోలి ఆనకట్ట నుంచి కడప జిల్లావైపుగల కేసీ ప్రధాన కాలువలో 150 క్యూసెక్కులు నీరు ప్రవహిస్తోంది. వరి పంట కోతలు కావడంతో నీటి మట్టాన్ని తగ్గించాం.

**ప్రశ్న:** లస్కర్ల కొరత ఉందా?

**జవాబు:** కేసీ ప్రధాన కాలువ కింద 13 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురికి గాను ఒకరు మాత్రమే ఉన్నారు.

**ప్రశ్న:** కేసీ కాలువ మరమ్మతు పనులకు ప్రతిపాదనలు చేశారా?

**జవాబు:** చాగలమర్రి చానల్‌కు మరమ్మతులు చేసేందుకై రూ.20 లక్షలతో ప్రతిపాదనలు చేశాం. వక్కిలేరు అక్విడేట్ మరమ్మతులకు రూ.9.5 లక్షలు నిధులు మంజూరైందని, వేసవి కాలంలో పనులు చేపడతాం.

**ప్రశ్న:** కుందూ విస్తరణ పనులు చేపడుతున్నారా?

**జవాబు:** రాజోలి ఆనకట్ట నుంచి గత ప్రభుత్వంలో కుందూ విస్తరణ పనులు జరిగాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచాయి. ప్రభుత్వ ఆదేశాలతో తిరిగి కుందూ విస్తరణ పనులు చేపడతాం.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

**బేతంచెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజను నిర్వహించారు. బుధవారం అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం స్వాములకు అన్నదాన (భిక్షా) కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు విశేష పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు చిన్నకృష్ణ, శ్రీనివాసులు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా పార్టీ సభ్యత్వ నమోదు



చంద్రపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాగేశ్వరరావుయాదవ్

**ప్యాపిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వై శైలజాయాదవ్, జయసుధ, సందీప్, సురేంద్ర, సుంకన్న, పుల్లయ్య, ఆదినారాయణ, రామసుబ్బయ్య, అశోక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సర్పంచుల శిక్షణ




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వర ప్రసాదరావు

**కోవెలకుంట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వర ప్రసాదరావు, ఈవోపీఆర్‌డి ప్రకాశ్‌నాయుడుల ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహించిన సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో ఏపీఎం శేఖర్, హెల్త్ సూపర్‌వైజరు మునిస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు పాల్గొని శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికం లేని పల్లెలే లక్ష్యం: ఎంపీడీవో

**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** పేదరికం లేని పల్లెలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం కావాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల, గ్రామస్థాయి అధికారులకు, సచివాలయాల సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తాహిర్‌హుసేన్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్‌ఫేర్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సహాయకులు, వీఆర్వోలు, జీఎంఎస్‌కెలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రవీంద్ర వరప్రసాద్



**డోన్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డోన్ డివిజన్ అధ్యక్షుడిగా రవీంద్ర వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని ఇండస్ట్రీరియల్ సబ్ స్టేషన్‌లో తెలుగునాడు విద్యుత్ కార్మికుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగన్న అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా వెంకట్రాముడు, కార్యదర్శిగా నాగచంద్రుడు, జాయింట్ సెక్రటరీగా మధు, కోశాధికారిగా రంగస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతమ కమిటీకి నాగన్న అభినందనలు తెలిపారు.

## 1,300 ఎకరాల్లో పంట నమోదు

**చాగలమర్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):** మండలంలో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన 1,300 ఎకరాల్లో ఈక్రాప్ నమోదు చేసినట్లు ఏవో రంగనేతాజీ బుధవారం తెలిపారు. తప్పనిసరిగా రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.